సాక్షి
జనగామ

శనివారం । 16 । ఆగస్టు । 2025



సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

టీజీ ఎన్పీడీసీఎల్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు.

- 8లో▸



సంఘాలను పటిష్టం చేయాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$28^0 / 22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత సాధారణం. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

విద్య, వైద్యానికి పెద్దపీట



ధర్మకంచ మినీ స్టేడియంలో జాతీయ జెండాను ఎగుర వేసి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పక్కన కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్

కుల గణన దేశానికే రోల్‌మోడల్

- జీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ఘనత
- ప్రగతిలో జిల్లా అగ్రగామి
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- అంబరాన్నంటిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు

జనగామ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన 79వ పంద్రాగస్టు దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించి, పోలీసుల మార్చ్ ఫాస్ట్ తిలకించారు. అనంతరం జాతీయ, తెలంగాణ గీతం ఆలపించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై విప్ మాట్లాడారు. 2047 నాటికి భారత్ రూపురేఖలు మార్చే గేమ్ ఛేంజర్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశానికి రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంటుకు పంపించిన ఘనత తమకే దక్కుతుందన్నారు.

జిల్లాలో 5,998 ఇందిరమ్మ ఇళ్లు

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5,998 ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ కాగా, ఇందులో 4,750 చోట్ల గ్రౌండింగ్ పూర్తై, నిర్మాణ పనులు మొదలైనట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. గత సీజన్‌లో 1.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.386కోట్లు జమ చేసినట్లు తెలిపారు. 2024–25 వార్షిక సంవత్సరంలో పదో తరగతిలో రాష్ట్రంలో 98.81శాతంతో ఉత్తమ ఫలితాలు సాధించగా, కలెక్టర్ రిజ్వాన్ బాషా, విద్యాశాఖ సంయుక్త భాగస్వామ్యంతో జాతీయ స్థాయిలో న్యాస్‌లో ఉత్తమంగా నిలవడం గర్వకారణమన్నారు. వానాకాలం సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతుభరోసా ద్వారా రూ.3.51లక్షల ఎకరాల సాగు భూమికి రూ.2.33 కోట్ల మేర జమ చేశామన్నారు. మహిళలను మరింత ఆర్థిక బలోపేతం చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం మేరకు ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో 50 వనిత టీస్టాల్స్ ఏర్పాటు లక్ష్యంగా రూ.158.29కోట్ల రుణాలు అందించినట్లు చెప్పారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు 90శాతం మేర భూసేకరణ పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో ప్రతి నీటి బొట్టును భూమిలోకి పంపించి, భూగర్భ జలాల సాధనే లక్ష్యంగా కలెక్టర్ ముందు చూపుతో 7,175 ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టి మరో రికార్డు సృష్టించారన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో జనగామలో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయన్నారు. అభివృద్ధి పథకాల అమలులో భాగంగా కృషి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మీడియాకు విప్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరు తెన్నులను అద్దంపట్టేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్, ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

2.39 కోట్ల మహిళలకు ఉచిత ప్రయాణం

జిల్లాలో మహాలక్ష్మి పథకంలో 2.39 కోట్ల మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.110.75 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. 76,403 తెల్లరేషన్ కార్డుదారులకు రూ.500 సబ్సిడీ అందించామన్నారు. గృహజ్యోతి ద్వారా 14.59 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల చొప్పున ఇప్పటి వరకు రూ.42.04 కోట్లు మేర జీరో కరెంటు బిల్లులు ఇష్యూ చేశామని, రాజీవ్ ఆరోగ్య శ్రీలో ఉచిత వైద్య సేవలకు గాను రూ.10 లక్షల వరకు పెంచగా, జిల్లాలో 23,345 మందికి శస్త్ర చికిత్సలు చేసి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 59,745 మంది రైతులకు రూ.522.72 కోట్ల మేర పంట రుణమాఫీ చేశామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో లింగాల ఘనపురం, చౌడారం, స్టేషన్‌ఘన్‌పూర్ కేజీబీవీ, నెహ్రూపార్కు రోడ్డు సెయింట్ పాల్స్, జనగామ రైల్వేస్టేషన్ ఏరియా, ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలు, ఎర్రగొల్లపహాడ్ యూపీఎస్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కరాటేతో పాటు దేశ భక్తిని చాటుకునేలా ప్రదర్శనలు నిర్వహించారు. 2024–25 వార్షిక సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖలో కొనసాగుతున్న ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విప్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 8 మందికి రూ.80 వేల నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్లను అందించారు. విద్యార్థులు బోయిని నాగవైష్ణవి (10వ తరగతి, కొడకండ్ల, టీజీఆర్ఎస్), జనగామ శ్రీజ (10వ తరగతి, కొడకండ్ల, టీజీఆర్ఎస్), ఆరు సాయివంశీ (10వ తరగతి, నర్మెట,మోడల్), ఎండీ గులాంసాధిక్ (10వ తరగతి, కొడకండ్ల, ఉన్నత పాఠశాల), జక్కుల పల్లవి (ఇంటర్, ఎంపీసీ, కొడకండ్ల, టీజీఆర్‌జేసీ, బాలికలు), చింతకింది స్పందన (ఇంటర్,ఎంపీసీ, కొడకండ్ల, టీజీఆర్‌జేసీ, బాలికలు) కున్సోతు నితిన్ కుమార్ (ఇంటర్, ఎంపీసీ,కొడకండ్ల, మోడల్), ఏ.హరిబాబు (ఇంటర్, సీఈసీ, స్టేషన్‌ఘన్‌పూర్, మోడల్) విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో నగదు బహుమతిని అందుకున్నారు.



బెలూన్స్ ఎగురవేస్తున్న విప్, కలెక్టర్, డీసీపీ

స్వయం సహాయ సంఘాలకు రూ.46.03కోట్ల రుణం



బ్యాంకు లింకేజీ చెక్కును పంపిణీ చేస్తున్న విప్, కలెక్టర్

జిల్లాలోని 420 మహిళా స్వయం సహాయ సంఘాలకు స్త్రీనిధి–మెప్మా, ఐకేపీ ద్వారా మంజూరైన రూ.46.03 కోట్ల రుణాలను విప్ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా అందించారు. ఇందులో డీఆర్డీ ద్వారా 377 సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 40.30కోట్లు, స్త్రీనిధి–మెప్మా ద్వారా 43 సంఘాలకు రూ.5.73 కోట్ల చెక్కులను అందించారు.

ఉత్తములకు ప్రశంస

- వివరాలు 8లో▸



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న విప్ బీర్ల అయిలయ్య



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కరాటే విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

కవులు, కళాకారుల నిలయం జనగామ



జనగామ: జనగామ జిల్లా కవులు, కళాకారులకు నిలయంగా కీర్తించబడుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం హాలులో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ టీజీఓ జనగామ సమాచార దర్శినిని ఆవిష్కరించారు. ఇందులో జనగామ జిల్లా చరిత్రను పొందు పరచడం గొప్ప విషయమన్నారు. జిల్లా విశిష్టతను తెలిపే విధంగా వీటిని ముద్రించి అందుబాటులో ఉంచితే భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం వక్తలు మాట్లాడు తూ బచ్చన్నపేట మండలం కట్కూరుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు, రచయిత్రి బల్ల సరస్వతి 1970 ప్రాంతంలో చిట్టి చిలకమ్మా గేయాన్ని రాయగా, తెలంగాణ ఆత్మకథ, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల పోరు, విద్యార్థుల బాధలను కళ్లకు కట్టినట్టుగా శిశిరధ్వని గేయ కావ్యాన్ని రచించి లక్షలాది మంది ప్రజల అభిమాన్ని చూరగొన్నారన్నారు. అనంతరం బల్ల సరస్వతిని ఘనంగా సత్కరించారు.

ఒగ్గు కళాకారుడికి సన్మానం



ఒగ్గు రవిని సన్మానిస్తున్న మదన్‌మోహన్‌శెట్టి

లింగాలఘణపురం : ఇండియన్ కాన్సులేట్ జనరల్ డాక్టర్ మదన్‌మోహన్‌శెట్టి చేతుల మీదుగా ఒగ్గుడోలు కళాకారుడు, ఉస్తాద్ ఒగ్గు రవిని న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో సన్మానించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా రాష్ట్రం నుంచి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సీడీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్లాండ్ వేదికగా జరిగిన ప్రదర్శనలో ఒగ్గుడోలు, పేరిణి, డప్పు కళాకారులు అద్భుతంగా తమ ప్రదర్శనలు ఇచ్చారు. దీంతో కళాకారులను ఇండియన్ కాన్సులేట్ జనరల్ మోహన్‌శెట్టి సన్మానించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సీడీ ఫౌండేషన్ చైర్మన్ చారుదాసులకు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశ్రీ గడ్డం సమ్మయ్యకు..



దేవరుప్పుల: టీజీఓఎస్ ఆధ్వర్యంలో అప్పిరెడ్డి పల్లెకు చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్యను కలెక్టర్ రిజ్వాన్‌బాషా సన్మానించారు. అంతముందుకు అమృత్ సరోవర్‌లో భాగంగా చిన్నమడూరు కోమటికుంటలో జాతీయ పతాకాన్ని సమ్మయ్య ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు.

పంట పొలాల్లో పంద్రాగస్టు



కొడకండ్ల: మండలంలోని నర్సింగాపురంలో పంట పొలాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ జెండాను ఎగురవేశారు. దేశగాని సతీష్‌గౌడ్, పలువురు రైతులు కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించగా రైతులు వినూత్నంగా పంట పొలాల వద్ద జెండాను ఆవిష్కరించుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో కప్పల రాజాలు, సోమయ్య, భిక్షపతి, శివ, సారయ్యలు పాల్గొన్నారు.

'నవోదయ' గడువు పెంపు

మామునూరు : వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న తేదీతో ముగియగా.. విద్యాలయ సమితి మరోమారు గడువు పెంచుతూ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

సమరయోధుల అడుగుజాడల్లో నడవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ

జనగామ రూరల్: స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ అన్నారు. పంద్రాగస్టు దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కోర్టు సిబ్బందిని ఉద్దేశించి ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతుందని, స్వేచ్ఛ స్వతంత్ర్యం కోసం పోరాడి వారి ప్రాణాలను త్యాగాలు చేశారన్నారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో జరిగిన ఆటల పోటీల్లో గెలుపొందిన న్యాయవాదులకు, సిబ్బందికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దండబోయిన హరిప్రసాద్ యాదవ్, సీనియర్ అడ్వకేట్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ గవర్నమెంట్ లీడర్స్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ మూలసూత్రాలను దెబ్బతీసే కుట్రలను చేస్తున్నారని, రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం ఇప్పటికీ భిన్నత్వంలో ఏకత్వంగా ఉండడానికి కారణం అంబేడ్కర్ అందించిన రాజ్యాంగమేనన్నారు. రాజ్యాంగాన్ని మనం కాపాడుకుంటే రాజ్యాంగం మనల్ని రక్షిస్తుందన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని, ఓటర్ల జాబితాలో తప్పిదాలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి చేపడుతున్న పథకాలు అద్భుతమని, దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అంతకుముందు పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు, మహిళలకు తడి, పొడి చెత్తబుట్టలను పంపిణీ చేశారు. మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ ఐలయ్య, పొట్లపల్లి శ్రీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, నాయకులు శిరీష్‌రెడ్డి, సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సైన్స్ కాంగ్రెస్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

- టాస్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ సత్యనారాయణ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 19, 20, 21వ తేదీల్లో తలపెట్టిన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) జనరల్ సెక్రటరీ, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ కోరారు. శుక్రవారం కేయూ అకడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డితో కలిసి సైన్స్ కాంగ్రెస్ నిర్వహణపై మానిటరింగ్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ పాల్గొని పలు సూచనలు చేశారు. స్పీకర్లుగా వచ్చే ప్రముఖ సైంటిస్టులకు వసతి తదితర ఏర్పాట్లపై చర్చించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్‌లో పలు సూచనలు చేశారు. ఈసారి సదస్సులో ప్రధాన థీమ్‌గా సాధికారిత కోసం వినూత్న పుణ్యాలు–యువభారతాన్ని మార్చడంలో శాస్త్ర సాంకేతికత అనే అంశంపై చర్చించనున్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

చేతవెన్న ముద్ద.. చెంగల్వ పూదండ

- నేడు శ్రీ కృష్ణ జన్మాష్టమి
- ఆలయాలు, పాఠశాలల్లో వేడుకలు

జనగామ: చేతవెన్న ముద్ద చెంగల్వ పూదండ, బంగారు మొలతాడు పట్టుదట్టి, సందెతా వీధులు సరి మువ్వ గజ్జెలు, చిన్ని కృష్ణ నిను చేరి కొలుతూ.. అంటూ నేడు (శనివారం) శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకునేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. హిందూ ఇతిహాసాల్లో ఎనిమిదో అవతారంగా పిలుచుకునే శ్రీకృష్ణభగవానుడి జన్మాష్టమిని కృష్ణాష్టమి, గోకులాష్టమి అని పిలుచుకుంటారు. శ్రావణమాసంలో వచ్చే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా వేడుకలను అట్టహాసంగా జరుపుకుంటారు. ద్వాపర యుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయనను ప్రతిఒక్కరూ ఇష్టదైవంగా కొలిచి మొక్కుతారు. వివిధ రూపాలు, సంప్రదాయాలతో కృష్ణపరమాత్మను కొలిచే విధానం భారతీయ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం. ఆ కులస్తులు కృష్ణుడిని కులదైవంగా కొలిచి మొక్కుతారు.

నేడు పోటీలు..

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటలకు సీతారామచంద్రస్వామి ఆలయంలో చిన్నారులకు రాధాకృష్ణుల వేషధారణ పోటీలను నిర్వహించనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లను వేషధారణలతో అలంకరించి తీసుకు రావాలని వీహెచ్‌పీ ప్రతినిధి మోహనకృష్ణ భార్గవ తెలిపారు. అలాగే యువతీ, యువకులకు ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పాటు చిన్నారుల కోసం భగవద్గీత పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. హిందూ బంధువులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విశ్వహిందూ పరిషత్ షష్ట్యాబ్ది స్థాపన దివస్ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు ఏకశిల పబ్లిక్ స్కూల్, గీతాశ్రమంలో బాలబారతి ఆధ్వర్యంలో నిర్వాహకులు త్రిపురారి సూర్యప్రసాద్‌పద్మ పర్యవేక్షణలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు

పురవీధుల్లో ఉట్టికొడుతూ...

శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని నేడు శ్రీకృష్ణమందిరంతో పాటు ఆలయాలు, శ్రీ వైష్ణవులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ఊయల కట్టి అందులో శ్రీ కృష్ణ విగ్రహాన్ని పడుకోబెట్టి, పాటలు, సంకీర్తనలు పాడుతూ ఆరాధిస్తారు. పళ్లు, అటుకులు, వెన్నె, పెరుగు మీగడను స్వామికి నైవేద్యంగా సమర్పిస్తారు. పురవీధుల్లో ఉట్లుకట్టి పోటీపడి వాటిని కొడతారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణున్ని ప్రార్థిస్తే గోదానం చేసిన ఫలితంగా భక్తుల విశ్వాసం. అంతే కాకుండా కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెబుతుందని భక్తులు అంటున్నారు.

ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందడి

హన్మకొండ కల్చరల్ : చారిత్రక వేయిస్తంభాల గుడిలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా రుద్రేశ్వరస్వామి వారిని విభూది, గంధంతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, మహా హారతి నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రభాతసేవ, గణపతికి అభిషేకం, రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు.

భద్రకాళి దేవాలయంలో..

భద్రకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శ్రావణమాస పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో సందర్శించారు. మేయర్ గుండు సుధారాణి ఒడిబియ్యం, చీర సమర్పించారు. న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోస్ట్ జితేంద్రగుప్తా, సీపీ ఎంజీ తెలంగాణ పీవీఎస్ రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో పాటు వరంగల్ ఎస్పీ రవికుమార్, హనుమకొండ ఎస్పీ హనుమంతు, సీతారాం, వెంకన్న ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



దేవరుప్పుల వాగుపై చెక్‌డ్యాం జలకళ

పరవళ్లు తొక్కుతున్న చెక్‌డ్యాంలు



కామారెడ్డిగూడెంలో పచ్చదనంతో వరిపంట

మొన్నటి వరకు వర్షాలు లేక ఎడారిలా కనిపించిన కోలుకొండ, గొల్లపల్లి వాగుల్లోని చెక్ డ్యాంలు ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జలకళను సంతరించుకొని పరవళ్లు తొక్కుతున్నాయి. చెరువులు మత్తడి పోస్తుండటంతో అన్నదాతలు సాగు ముమ్మరం చేశారు. ఇప్పటికే వేసిన వరిపంట పచ్చదనంతో ఉట్టిపడుతోంది. - దేవరుప్పుల

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని సిరి

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని దైనంపల్లి సిరి తొమ్మిదో తరగతి చదువుతుంది. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వేడుకల ఏర్పాట్లలో భాగంగా స్టీల్ పైప్‌తో కూడిన జెండాలను పట్టుకుని వెళ్తున్న క్రమంలో పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యార్థిని సిరి చేతికి, కాలుకు గాయాలు అయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించా రు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న బాలికను పరామర్శించారు.


జనగామ ఆర్డీఓ గోపీరామ్‌కు ప్రశంస పత్రం అందిస్తున్న విప్ బీర్ల అయిలయ్య. చిత్రంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్, డీసీపీ, తదితరులు

ఉత్తములకు ప్రశంస

పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీస్టేడియంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో విధి నిర్వహణలో ఉత్తమంగా పని చేసిన ఆయా శాఖల జిల్లా, మండల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్‌తో కలిసి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రశంస పత్రాలు అందించారు.

– జనగామ


కృష్ణమూర్తి, అడిషనల్ కలెక్టర్ సీసీ


మాత్యనాయక్, హౌసింగ్ పీడీ · పల్లవి, డీపీఆర్ఓ · ఖాజా, అదనపు కలెక్టర్ సీసీ · వెంకట్‌రెడ్డి, క్రీడల శాఖ అధికారి


హతీరాం, సివిల్ సప్లయీస్ డీఎం · గౌసియా బేగం, జీసీడీఓ · వసంత, గ్రామీణాభివృద్ధి అధికారి · మల్లికార్జునరావు, డీఎంహెచ్ఓ · శ్రీనివాస్, ఈఈ, పీఆర్ · టి.వేణుగోపాల్, ఎస్ఈ · రాజమహేంద్ర నాయక్, డీసీపీ · హుస్సేన్, తహసీల్దార్ · అన్వేష్, ఆర్ఐ · సుంచు శంకర్, డిప్యూటీ తహసీల్దార్ · స్రవంతి, డిప్యూటీ తహసీల్దార్ · చంద్రశేఖర్, ఎస్‌డీసీ · పండేరీ చేతన్ నితిన్, ఏఎస్పీ


వేణు, సీఐ, స్టేషన్‌ఘన్‌పూర్ · శ్రీనివాస్, సీఐ, రఘునాథపల్లి · వెంకట్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ · సృజన్, ఎస్సై, దేవరుప్పల · భరత్, ఎస్సై, జనగామ · రాజన్ బాబు, ఎస్సై, జనగామ · కరుణాకర్, పీసీ · భరత్, పీసీ · సురేష్, పీసీ · దీప్తి, లీగల్ వలంటీర్ · మధు, ఎస్సై, టాస్క్‌ఫోర్స్ · నాగ శేషాద్రి, ఎంపీడీఓ, కొడకండ్ల · సంపత్‌కుమార్, ఎంపీడీఓ, జనగామ


ప్రవీణ్ కుమార్, సివిల్ సప్లై ఆఫీసు · నాగరాజు, డాటా ఆపరేటర్ · శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీఓ ఆఫీసు · లక్ష్మీనారాయణరెడ్డి, డీఈ, విద్యుత్ శాఖ · విజయ్‌కుమార్, డీఈ, విద్యుత్ శాఖ · జగదీష్, సీనియర్ అసిస్టెంట్ · స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్ · వెంకటేష్, కానిస్టేబుల్ · శ్రీనివాస్ డిప్యూటీ ఈఈ, పీఆర్ · డాక్టర్ రజని, గైనకాలజిస్ట్ · డాక్టర్ శ్రీకాంత్, సివిల్ సర్జన్ · డాక్టర్ కర్ణాకర్‌రాజు, ప్రోగ్రాం ఆఫీసర్


రవీందర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ · మమత, మెడికల్ ఆఫీసర్ · సంపత్ డీపీఆర్ఓ కార్యాలయం · నరేష్, డీపీఆర్ఓ ఫొటోగ్రాఫర్ · నరేందర్, ఉపాధ్యాయుడు · శ్రీనివాస్, ఏఎంఓ · నరసింహరావు, ఉపాధ్యాయుడు · రూప్సీ లక్ష్మీ బాయి, పోచన్నపేట · సతీష్ బాబు, టీచర్ · నాగపురి స్వరూప, డీపీఓ · భోజన్న, ఇన్‌చార్జ్ డీఈఓ · సంపత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్

డెంగీతో బాలిక మృతి


శాన్విక (ఫైల్)

వేలేరు: డెంగీ జర్వంతో బాలిక మృతి చెందింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూత్రపు రమేష్ కూతురు శాన్విక(7)కు ఐదు రోజుల క్రితం జర్వం రాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానాకు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా గుర్తించి చికిత్స చేస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దంత వైద్యశిబిరానికి స్పందన


టూత్‌పేస్ట్ అందజేస్తున్న డాక్టర్ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: భారత స్వాతంత్య్ర దినోత్సవం, ఎస్‌వీఎస్ దంత వైద్యశాల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తాలోని దంత ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ గిరిధర్‌రెడ్డి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, టూత్‌పేస్టులు, మౌత్ వాష్‌లు అందజేశారు. దంతాల పరిరక్షణపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు గణేష్, హారిక, సిబ్బంది యాకూబ్‌రెడ్డి, సౌమ్య, చంద్రిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వాజేడు: కనువిందు చేస్తున్న బొగత జలపాతం

బొగత కనువిందు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం శుక్రవారం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. దండకారణ్యంలోని కర్రె గుట్టలపై గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పైన ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతానికి భారీగా వరద వస్తోంది.

విద్యార్థి ఆత్మహత్య


సాయివర్ధన్ (ఫైల్)

బచ్చన్నపేట: తండ్రి మందలించాడని మనస్థాపంతో విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్సై అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడబోయిన నర్సమ్మ–మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్న కుమారుడు సాయివర్ధన్ (20) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. సాయివర్ధన్ సరిగా చదవడంలేదని తండ్రి మల్లయ్య మందలించాడు. దీంతో సాయివర్ధన్ క్షణికావేశంలో తమ బావి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి


బన్నీ (ఫైల్)

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన గద్దల బన్నీ (17) తన చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ గ్రామమైన ఉప్పరగూడెంలో తాత కొమురయ్య సంరక్షణలో పెరిగాడు. పదో తరగతి పూర్తి కావడంతో ప్రస్తుతం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రాఖీ పౌర్ణమితోపాటు వరుస సెలవులు రావడంతో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. శుక్రవారం తాత పొలం పనులకు వెళ్లాడు. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించామని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు.

సంఘాలను మరింత పటిష్టం చేయాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రవీందర్ రావు, డైరెక్టర్లు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీలు, టెస్కాబ్ పాలకవర్గాలకు ప్రభుత్వం ఆరు నెలలు పొడిగింపు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్రపటాలకు పాలక వర్గంతో కలిసి రవీందర్ రావు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. వరంగల్ డీసీసీబీని ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. వ్యవసాయ రంగానికి సేవలు విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ డైరెక్టర్లు హరిప్రసాద్, మాడుగుల రమేష్, దొంగల రమేష్, ఎర్రబెల్లి గోపాలరావు, మురళి, సంపెల్లి నరసింగరావు, నరేందర్ రెడ్డి, పోలపాక శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు రాజేష్ ఖన్నా, రామచంద్ర రావు, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ గౌడ్, డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

- టీజీ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు



మాట్లాడుతున్న వంగూరు మోహన్ రావు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ వంగూరు మోహన్‌రావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మోహన్‌రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏపీటీఎస్–విజిలెన్స్ వారిచే గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగ అమరులకు కార్యాలయం ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 18 జిల్లాల్లో 70 లక్షల మంది వినియోగదారులకు 24/7 మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2024 సంవత్సరం (ఏప్రిల్ నుంచి జూలై) తో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్ డౌన్స్ 2025 (ఏప్రిల్ నుంచి జూలై) లో 21శాతం, 11 కేవీ బ్రేక్ డౌన్లు 46శాతం తగ్గాయన్నారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సీఎండీ వరుణ్ రెడ్డి స్వీయ ఆలోచనతో రూ. కోటి బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. పునరుత్పాదక శక్తి జూన్ 30, 2025 నాటికి ఎన్పీడీసీఎల్‌లో 2155.87 మెగావాట్ల సోలార్ ఎనర్జీ జనరేషన్ సామర్థ్యాన్ని సాధించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వంటేరు తిరుపతి రెడ్డి, మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు అశోక్ కుమార్, తిరుమల్‌రావు, రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ, మాధవరావు, సీజీఎంలు చరణ్ దాస్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరి రమేష్, కంపెనీ కార్యదర్శి వెంకటేశం, వరంగల్ ఏపీటీఎస్ సీఐ కిరణ్ పాల్గొన్నారు.

నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- 25 కిలోల 800 గ్రాముల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నరసింహారావు


నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ డ్రగ్స్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నరసింహారావు వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ దగ్గర నలుగురు వ్యక్తులు ఎండు గంజాయి కలిగి ఉన్నారని వచ్చిన సమాచారంతో నార్కొటిక్స్ సీఐ శ్రీకాంత్, ఎస్సై సీహెచ్ పరుశురాములు, సిబ్బందితో కలిసి వెళ్లి కారులో గంజాయిని తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఎండీ ఫైజాన్, ఎస్‌డీ అన్సార్, ఎండీ అర్బాన్, కుమార్‌పల్లికి చెందిన అర్షద్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 25కిలోల 800గ్రాముల ఎండు గంజాయితోపాటు ఐదు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫైజాన్, అన్సార్, అర్బాన్.. ఆంధ్రప్రదేశ్– ఒడిశా బార్డర్ వద్ద బాలు అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొచ్చి హనుమకొండలోని కుమార్‌పల్లి చెందిన అర్షద్ అలీఖాన్ ఇంట్లో డంప్‌చేసి, అవసరమైన వాళ్లకి విక్రయిస్తుంటారు. ఈక్రమంలో గంజాయిని కారులో తీసుకొస్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. నిందితులను హనుమకొండ పోలీసులకు అప్పగించగా ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ నార్కొటిక్ డ్రగ్స్ కంట్రోల్ టీం, హనుమకొండ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాకాల మత్తడి పరవళ్లు



ఖానాపురం:వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో సరస్సులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. శుక్రవారం మత్తడి పోయడంతో ప్రజలు మత్తడి వద్ద సందడి చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మత్తడిని సందర్శించి పూజలు చేశారు.